సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం, 8, జూన్, 2023



రైతును రాజు చేయడమే లక్ష్యం
రైతును రాజు చేయాలనేదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. -9లో



ఈదురు గాలులు, వర్ష బీభత్సం
వలిగొండ, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లో ఈదురు గాలులు, వర్షం బీభత్సం సృష్టించింది. -10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 42°/29°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

50 యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి

భువనగిరి టౌన్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. బుధవారం ఆయన సీఎస్ శాంతికుమార్‌తో కలిసి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కుల వృత్తిదారులకు ప్రభుత్వం అందజేసే రూ.లక్ష రుణంపై సమీక్షించారు. మొదటి రోజు కనీసం 50 యూనిట్లు గ్రౌండ్ చేయాలని సూచించారు. అలాగే మంత్రి హరీష్‌రావు మట్లాడారు. 15వ తేదీన లబ్ధిదారులకు ఎమ్మెల్యేలు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన గావించారు.అలాగే బాలభోగం చేపట్టి మూలవర్యులకు నిజాభిషేకం చేసి అలంకరించారు. అనంతరం శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్యకల్యాణం, తిరువీధి జోడు సేవలు నిర్వహించారు. రాత్రి పవళింపు సేవ చేసి ఆలయాన్ని ద్వారబంధనంచేశారు.

109 మందికి జరిమానా



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్టలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 109 మంది పట్టుబడ్డట్లు ట్రాఫిక్ సీఐ శంకర్‌గౌడ్ తెలిపారు. వీరిని ఆలేరు కోర్టులో ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున జరిమానా విధించారని పేర్కొన్నారు. పట్టుబడిన వాహనాల్లో బైక్‌లు 47, త్రీ వీలర్లు 6, ఫోర్ వీలర్లు 56గా ఉన్నట్లు తెలిపారు. అనంతరం డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

కల్తీకి పాల్పడితే చర్యలు



నాణ్యమైన ఆహారంపై అవగాహన కల్పిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

భువనగిరి : ప్రపంచ ఆహార దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాలను ప్రదర్శించారు. నాణ్యమైన ఆహారపదార్థాలపై అవగాహన కల్పించారు. కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహార పదార్థాల నాణ్యతపై ప్రజల్లోనూ చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార పదార్థాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి, డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ కళ్యాణ్, జిల్లా అధికారి స్వాతి పాల్గొన్నారు.

11న సాహిత్య దినోత్సవం

సాక్షి యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11న తెలంగాణ సాహిత్య దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో కవి సమ్మేళనం ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన కవులు, సాహితీ వేత్తలు పాల్గొనాలని, కవితలు 20 నుంచి 25 పంక్తులకు మించకుండా ఉండాలన్నారు.తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రగతి అనే అంశాలతో కవితలు ఉండాలన్నారు. పంపించే కవితలు ఇంతకుముందు దినపత్రికలు, కవితా సంపుటాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచురించబడి ఉండకూడదన్నారు. ఒక కవి ఒక కవితను మాత్రమే పంపించాలన్నారు.

డుమ్మాలకు ఇక చెక్!

496 పాఠశాలల్లో బయోమెట్రిక్
- ఐరిష్ రికగ్నిషన్‌తో హాజరు నమోదు
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు
- త్వరలో హెచ్‌ఎంలకు ట్యాబ్‌ల పంపిణీ



ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు	488
ఎస్‌జీటీలు 1,285	ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు 36

సాక్షి,యాదాద్రి : డ్యూటీకి డుమ్మా కొట్టే ఉపాధ్యాయులకు ఇక చెక్ పడనుంది. ఇందుకోసం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు విధానం అమల్లోకి రానుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత విద్యా సంవత్సరం రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో బయోమెట్రిక్ విధానం అమలు చేయగా ఉత్తమ ఫలితాలు వచ్చాయి. దీంతో మన జిల్లాలో కూడా ఐరిష్ రికగ్నిషన్ (కంటి చూపు) విధానం అమల్లోకి తేనున్నారు. ఇందుకోసం ప్రధానోపాధ్యాయులకు ఈనెల 20వ తేదీన ట్యాబ్‌లు సరఫరా చేయనున్నారు.

అమలు చేయనున్న పాఠశాలలు

బయోమెట్రిక్ హాజరు విధానాన్ని జిల్లాలోని 488 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు చేయనున్నారు.హైదరాబాద్, జనగామ, సూర్యాపేట, సిద్దిపేట, నల్లగొండ జిల్లాలకు శివారులో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాకు ఆయా ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు ఎక్కువగా వచ్చిపోతుంటారు. సింహభాగం హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించే వారు ఎక్కువ. అయితే పాఠశాలల వేళల కంటే రైళ్లు, బస్సుల వేళలకు అనుగుణంగా ఉపాధ్యాయులు వచ్చిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పలు మార్లు జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ ప్రత్యేకంగా చేసిన తనిఖీల్లో ఈ విషయం వెల్లడైంది. ప్రధానంగా మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉంటుంది. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న చోట వంతుల వారీగా ఒక్కో ఉపాధ్యాయుడు వస్తున్నారు. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులు అనధికారికంగా వలంటీర్లను నియమించి రోజుల తరబడి పాఠశాలకు హాజరు కావడం లేదు. మరికొన్ని చోట్ల హాజరు పట్టికలో తేదీ వేయకుండా సెలవు చీటీ పెట్టి డుమ్మాకొడుతున్న సంఘటనలకు చెక్ పెట్టేందుకు ఐరీష్ రికగ్నేషన్ హాజరు నమోదు తీసుకువస్తున్నారు. అయితే బడికి డుమ్మా కొట్టే వారికి ఇబ్బంది ఉంటుంది కానీ క్రమం తప్పకుండా పాఠశాల విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఎలాంటి నష్టం ఉండదని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయికి సర్వర్ లింక్

సమగ్ర శిక్షా నిధుల నుంచి ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. వీటిని పాఠశాలల్లో మల్టీపర్పస్ అవసరాలకు వినియోగించనున్నారు. ఉపాధ్యాయుల హాజరు, ఆన్‌లైన్ పనులు ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణలో పాఠశాల స్థాయిలో జరుగుతాయి. సర్వర్ లింక్ రాష్ట్రస్థాయిలో ఉన్న విద్యాశాఖ డీఎస్‌సీ లాగిన్‌లో చేస్తారు. దీంతో పాటు జిల్లా, మండల, పాఠశాల స్థాయిలో లాగిన్ అవుతుంది. దీంతో అన్ని చోట్ల ఉపాధ్యాయుల హాజరు, ఇతర వివరాలు కన్పిస్తాయి. అటెండెన్స్‌తో పాటు పాఠశాలలకు సంబంధించిన అన్నిరకాల విద్యా విషయాలు ట్యాబ్‌లలో పొందు పరుస్తారు.

కేజీబీవీల్లో..

కేసీబీవీల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదు కోసం గతంలో ఆధార్ బేస్డ్ విధానం అమలు చేయాలనుకున్నారు. కానీ, సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో ఆ నిర్ణయాన్ని విరమించుకున్నారు.

విద్యా దినోత్సవం రోజున ట్యాబ్‌ల పంపిణీ

ఈనెల 20 విద్యాదినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ట్యాబ్‌లను ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేయనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, బడిబాట సందర్భంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులు, యూనిఫాం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఉపాధ్యాయుల హాజరు, సెలవులు ఇతరత్రా వివరాలను ప్రధానోపాధ్యాయులు ట్యాబ్‌లలో పొందుపరచనున్నారు. గతంలో మాదిరిగా ఆన్‌లైన్ పనుల కోసం మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల చుట్టూ తిరిగే పరిస్థితిని నివారించడానికి పాఠశాలలకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారు.

అపరభగీరథుడు సీఎం కేసీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

- కాళేశ్వరంతో సమృద్ధిగా సాగు నీరు
- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి : కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను పొలాలకు తరలించిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం భువనగిరిలోని వైఎస్ఆర్ ఫంక్షన్ హాలులో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సాగు నీటి ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014కు ముందు సాగు, తాగు నీటికి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ కష్టాలు తొలగిపోయాయన్నారు. కరెంట్, సాగు, తాగునీటి సమస్య నివారణకు సీఎం కేసీఆర్ కార్యాచరణ రూపొందించి విజయవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ పథకంతో చెరువులు పూర్వ వైభవం సంతరించుకున్నాయని, బీబీనగర్, భువనగిరితో ఏ చెరువును చూసినా నీటితో కళకళలాడుతున్నాయన్నారు. పూడికతీసి మరమ్మతులు చేయడంతో భూగర్భ జలాలు పెరిగాయని, మండువేసవిలో సైతం నీటితో నిండుగా దర్శనమిస్తున్నాయని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తారని ఎవరూ ఊహించలేదని, భువనగిరి నియోజకవర్గానికి గోదావరి జలాలు వస్తాయనుకోలేదని సీఎం కేసీఆర్‌తో అది సాధ్యమైందన్నారు. ప్రపంచంలోనే ఎత్తయిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని కొనియాడారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా సరఫరా అవుతుందన్నారు. రైతు బాగుంటేనే అందరూ బాగుంటారన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, రైతు కల్లాలు, ఉచిత కరెంట్ వంటి పథకాలు తీసుకురావడంతో పాటు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కాళేశ్వరం.. తెలంగాణకు గర్వకారణం : కలెక్టర్

కాళేశ్వరం తెలంగాణకు గర్వకారణమని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. నీటి కోసం అనేక పోరాటాలు జరిగాయని, దాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి గోదావరి జలాలు అందిస్తున్నారని తెలిపారు. ఒక కోటి 80లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, 6 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. గతంలో వానాకాలంలో 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి రాగా ఇప్పుడు రెండు సీజన్లలో ఒక్కో సీజన్‌కు 5లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందన్నారు. చిత విద్యుత్‌ను రైతులు వృథా చేయవద్దన్నారు. సాగునీటి రంగం అభివృద్ధికి నీటి పారుదల ఇంజనీర్లు, సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఊరూరాచెరువుల పండుగ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం జూలూరు గౌరీ శంకర్ రచించిన 'నా తెలంగాణ కోటి ఎకరాల మాగాణం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు జిల్లా నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు శ్రీనివాస్ ప్రగతి నివేదిక చదివి వినిపించారు. సాగునీటి, సంక్షేమ కార్యక్రమాలను తెలియచేసే వీడియోను ప్రదర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అమరేందర్‌గౌడ్, జెడ్పీటీసీలు బీరుమల్లయ్య, పుష్పలత, ప్రణీత, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, మండల స్పెషల్ ఆఫీసర్లు, నీటి పారుదల శాఖ డీఈలు, ఏఈలు, రైతులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా దశాబ్ది ఉత్సవాలు



భువనగిరిలో హాజరుకాని రైతులు

తొమ్మిదేళ్ల ప్రగతి ఫలాలను ప్రజలకు వివరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు చప్పగా సాగుతున్నాయి. భువనగిరి, తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో బుధవారం నిర్వహించిన సాగు నీటి ఉత్సవాలు రైతులు లేక వెలవెలబోయాయి. అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో రైతులు నామమాత్రంగా కూడా హాజరుకాలేదు. అధికారులు, కొద్ది మంది బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు. రైతులు లేకపోవడంతో ఎమ్మెల్యేలు చాలసేపు వేచి చూడాల్సి వచ్చింది. సమావేశ ప్రాంగణాల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. 3వ తేదీన నిర్వహించిన రైతు దినోత్సవంలోనూ రైతుల సంఖ్య నామమాత్రంగా ఉంది. సమభావన సంఘాల సభ్యులు, ఉపాధిహామీకూలీలను తీసుకుని వచ్చి మమ అన్పించారు. ప్రతి రైతువేదిక వద్ద 1000 మంది రైతులను సమీకరించాలనుకున్నా కేవలం 300 లోపే రైతులు అతికష్టంగా హాజరయ్యారు.

వైద్య సేవలు, వసతుల్లో భేష్!

- జిల్లా కేంద్ర ఆస్పత్రికి కాయకల్ప అవార్డు
- వరుసగా రెండవ సారి
- పెరిగిన ఆస్పత్రి గ్రేడ్



భువనగిరి : జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలకు అరుదైన గౌరవం దక్కింది. ప్రభుత్వం కాయకల్ప అవార్డుకు ఎంపిక చేసింది. వరుసగా రెండవ సారి అవార్డుకు ఎంపికై క్వాలిటీ అసెస్‌మెంట్ స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో 13 ఆస్పత్రులను ఎంపిక చేయగా ఇందులో భువనగిరి ఆస్పత్రి కూడా ఉంది.

13 అంశాలు పరిగణనలోకి..

కేంద్ర కుటుంబ, సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు ప్రతి ఏటా ఏరియా ఆస్పత్రులను సందర్శిస్తాయి. కాయకల్ప అవార్డు ఎంపిక కోసం 13 అంశాలను పరిగణలోకి తీసుకుంటాయి. ఇందులో శానిటేషన్, ప్రసవ గది, ఆస్పత్రి ఆవరణ, ల్యాబ్, బయో మెడికల్ వెస్ట్ మేనేజ్‌మెంట్, మందుల పంపిణీ, వ్యాక్సినేషన్ తో పాటు ఆరు అంశాలను బృందం సభ్యులు పరిశీలిస్తారు. ఇందులో భాగంగా జనవరిలో కాయకల్ప బృందం జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించి ఆయా అంశాలను పరిశీలించారు. సేవలపై నేరుగా రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 6వ తేదీన రాష్ట్రంలో 13 ఆస్పత్రులను కాయకల్ప కింద ఎంపిక చేశారు. ఇందులో జిల్లా ఆస్పత్రి 71.05 మార్కులను సాధించి అవార్డు దక్కించుకుంది.

ఆస్పత్రి అభివృద్ధికి నిధులు

100 పడకల సామర్థ్యం కలిగిన జిల్లా కేంద్ర ఆస్పత్రికి రోజూ 450 నుంచి 500 మంది రోగులు వస్తుంటారు. వీరితో పాటు ఇన్‌పేషెంట్‌గా 35 నుంచి 53 వరకు ఉంటారు. కాయకల్ప అవార్డు కింద ఇచ్చే రూ.3లక్షలను ఆస్పత్రి అభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. ఇందులో ప్రధానంగా ప్రసవ గది, చిన్న పిల్లల వార్డు, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్ థియేటర్, రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం కోసం ఖర్చు చేస్తారు.

> **ఆస్పత్రి గ్రేడ్ పెరిగింది**
> జిల్లా కేంద్ర ఆస్పత్రికి వరుసగా రెండు సార్లు కాయకల్ప అవార్డు లభించింది. రూ. 6 లక్షలు నిధులు వచ్చాయి. ఈ నిధులు ఆస్పత్రిలోని పలు విభాగాల అభివృద్ధికి దోహదపడనున్నాయి. వైద్యులు, సిబ్బంది సహకారంతో రెండు సార్లు అవార్డు దక్కడంతో ప్రస్తుతం క్వాలిటీ అసెస్‌మెంట్ స్థాయికి పెరిగింది.
> –చిన్ననాయక్, డీసీహెచ్‌ఎస్

నేటినుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

భువనగిరిటౌన్ : జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఇందుకోసం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ సిద్ధమవుతోంది. చేపల వంటకాలపై ఇప్పటికే 30 మందికి శిక్షణ ఇచ్చారు.

15 రకాల వంటకాలు

కళాశాల ఆవరణలో సుమారు 15 రకాల చేపల వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు తక్కువ ధరకు చేపల వంటకాలను విక్రయించనున్నారు. ఫిష్ ఫుడ్ పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరంచారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, ఏఓ నాగేశ్వరచారి అధికారులు పాల్గొన్నారు.



ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

- కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, మండల ప్రత్యేకాధికారులు, నీటి పారుదల శాఖ ఇంజనీర్లు, తహసీల్దార్లతో కలిసి నేడు నిర్వహించనున్న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. అంగన్‌వాడీలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ఉదయం 11.00 గంటలకు పూజా కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు తప్పనిసరగా హాజరుకావాలని, సాయంత్రం 4 గంటలకు ప్రజలతో కలిసి చెరువుల వద్దకు ర్యాలీలు తీయాలని, 8గంటలకు భోజనంతో కార్యక్రమాన్ని ముగించాలని సూచించారు. చెరువల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని, ఈగతాళ్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

చెరువుల పండుగ కార్యక్రమాలు ఇలా..

భువనగిరిటౌన్ : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ నిర్వహించనున్నారు. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- రైతులు, మత్స్యకారులు, మహిళలు డప్పులు, బోనాలు, బతుకమ్మలు, వలలతో ఊరేగింపుగా చెరువుల వద్దకు వెళ్లాలి.
- పండుగ వాతావరణం ప్రతిబింబించేలా చెరువు కట్టలను అలంకరించాలి.
- నీళ్లకు పూజ చేసిన అనంతరం సభ ఏర్పాటు నిర్వహించాలి. బతుకమ్మ, కోలాటాల ప్రదర్శన తో పాటు గోరేటి వెంకన్న రాసిన చెరువోయి.. మా ఊరి చెరువు వంటి పాటలు వినిపించాలి.
- నీటిపారుదల శాఖ ప్రగతి, పంటల ఉత్పత్తి, మత్స్య సంపద, భూగర్భ జలాల వృద్ధిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. కరపత్రాలు పంపిణీ చేయాలి.
- గ్రామస్తులతో కలిసి నాయకులు చెరువు కట్టపై సహపంక్తి భోజనాలు చేయాలి.

పెట్రోల్, డీజిల్ ధరలు సవరించాలని వినతి

మోత్కూరు : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్ ధరలను సవరించాలని కోరుతూ రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఉమ్మడి రాష్ట్రాల ఇండియన్ ఆయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ కమల్‌షీల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. సింగిల్‌విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెంట్రోల్ బంకులకు ఎక్కువ ధరకు పెట్రోల్, డీజిల్ సరఫరా చేస్తుండటంతో ఏడాది కాలంగా బంకులు మూతపడ్డాయన్నారు. దీంతో సింగిల్‌విండోలు నష్టాల్లోకి వెళ్లడమే కాకుండా లక్ష్యం నెరవేరడం లేదన్నారు. ఈ సమస్యపై జనరల్ మేనేజర్ స్పందిస్తూ త్వరలోనే అధికారులతో సమీక్ష నిర్వహించి ధరలు తగ్గించడమా లేక సింగిల్‌విండో పంపులను రిటైల్ పంపులుగా మార్చడమా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని రామకృష్ణారెడ్డి తెలిపారు.

గోదారమ్మతో సస్యశ్యామలం

- కాళేశ్వరం ప్రాజెక్టుతోనే తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాలకు సాగునీరు
- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- బీబీగూడెం వద్ద గోదావరి జలాలకు లక్ష జనహారతి



చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద కాళేశ్వరం జలాలకు పూలు చల్లుతున్న మంత్రి



ఎస్సారెస్పీ కాల్వలో మత్స్యకారులతో మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): సీమాంధ్రుల పాలనలో బీళ్లుగా ఉన్న తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడలోని కొద్ది ప్రాంతం భూములు స్వరాష్టం వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మేడిగడ్డ వద్ద నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు అందుతుండడంతో నేడు సస్యశ్యామలంగా మారాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేసిన శంకుస్థాపన రాళ్ల ఈ ప్రాంత రైతాంగాన్ని వెక్కిరించేలా ఉండగా.. నాటి ప్రతిపక్ష నాయకుడు నాటిన మొక్కలు కాస్త వట వృక్షాలుగా మారాయని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ 71 డీబీఎం వద్ద కాళేశ్వరం జలాలకు లక్ష జనహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి జలాలకు హారతి పట్టి పూలు చల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సమైక రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీని కనిపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఆ సమయంలోనే సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కేసీఆర్ పర్యటించినప్పుడు ఈ ప్రాంతానికి గోదావరి జలాలే శరణ్యమని భావించారని గుర్తు చేశారు. మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి మిడ్ మానేరుకు అటు నుంచి లోయర్ మానేరుకు అక్కడి నుంచి ఈ ప్రాంతానికి నీళ్లు పారించారని తెలిపారు. దీంతో యావత్ భారతదేశంలోనే వరి దిగుబడిలో సూర్యాపేట రికార్డు సృష్టించిందన్నారు. అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పుకునేందుకు దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నీటిపారుదల దినోత్సవం రోజును ఈ ప్రాంత రైతాంగం కాళేశ్వరం జలాలకు లక్ష జనహారతి కార్యక్రమం నిర్వహిస్తామని ముందుకు రావడం శుభపరిణామమన్నారు. వాస్తవానికి లక్ష మందితో నిర్వహించాలి అనుకుంటే లక్షా 16 వేల 142 మంది హాజరయ్యారని వెల్లడించారు. కాళేశ్వరం జలాలతో మొదట లబ్ధి పొందిన తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ రైతాంగాం స్వచ్ఛందంగా భాగస్వామ్యం అయినందునే ఈ కార్యక్రమం విజయవంతమైందని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

శాశ్వతంగా గుర్తుండిపోతుంది

ఏడు మండలాల పరిధిలోని 126 గ్రామాలకు చెందిన రైతులు బోనాలు, బతుకమ్మలతో తరలివచ్చి సామూహికంగా వంటావార్పులు నిర్వహించి పండుగ వాతావరణంలో లక్ష జనహారతి జరుపుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమం శాశ్వతంగా గుర్తుండి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

126 గ్రామాల నుంచి జనం

సాగునీటి దినోత్సవానికి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోని ఏడు మండలాల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. 71 డీబీఎం పరిధిలోని 126 గ్రామాల ప్రజలు, రైతులు తమకు సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల జనంతో కాలువ గట్లు కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక పూజలు అనంతరం ఎక్కడికక్కడ వంటావార్పుతో సామూహిక భోజనాలు చేశారు. ఇకపోతే కాలువ పొడవునా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు గ్రామస్తులతో కలిసి ఈ సాగునీటి దినోత్సవం పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ దొంగ అరెస్ట్

మునుగోడు: బైక్‌లను అపహరిస్తున్న దొంగను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్.ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చండూరు మండలం బోడంగిపర్తికి చెందిన కట్కూరి నరేష్ మునుగోడులోని చండూరు రోడ్డులో టైయిర్ పంక్చర్ దుకాణం పెట్టుకొని జీవిస్తున్నాడు. అయితే అతను గత మంగళవారం కొరటికల్ గ్రామానికి చెందిన ఐతగొని రవి మునుగోడులోని సృజన ట్రేడర్స్ ఎరువుల దుకాణం ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని అపహరించాడు. దీంతో రవి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపి నరేష్‌ని అదుపులోకి తీసుకొని విచారించి రిమాండ్‌కు తరలించారు.

పది మామిడి చెట్లు, బోరు మోటార్ దగ్ధం

పెన్‌పహాడ్ : గుర్తుతెలియని వ్యక్తులు వరికొయ్యలకు పెట్టిన నిప్పు పెట్టడంతో వ్యాపించిన మంటలు అంటుకుని పది మామిడి చెట్లు, బోరు మోటారు దగ్ధమైంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండపనేని విద్యాసాగర్ రావుకు గ్రామ శివారులో మామిడి తోట పక్కన గల వరి కొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆ మంటలు ప్రమాదవశాత్తు తోటలోకి వ్యాపించి మామిడి చెట్లు, పైపులు, బోరు మోటార్ దగ్ధమయ్యాయి. సుమారు లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోదాడరూరల్ : కోదాడ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్న క్వింటాన్నర రేషన్ బియ్యాన్ని బుధవారం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. అనంతగిరి మండలానికి చెందిన సైదా గోల్‌తండా పరిసరా ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేసి జగ్గయ్యపేటకు చెందిన పిచ్చయ్యకు విక్రయించేందుకు వెళ్తుండగా మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్‌రోడ్ వద్ద పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నలుగురిపై కేసు

కోదాడరూరల్ : ఏపీ నుంచి తెలంగాణలోకి అక్రమంగా రవాణా అవుతున్న రెండు ఇసుక లారీలను బుధవారం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఏపీలోని నందిగామ సమీపంలో గల గనత్కుర్ ఇసుక రీచ్ నుంచి రెండు ఇసుక లారీలు అనుమతులు లేకుండా కోదాడకు వస్తుండగా రామాపురం క్రాస్‌రోడ్, కాపుగల్లు శివారులో పట్టుకుని వాటి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

త్రిపురారం : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. ఏఎస్ఐ రామయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బడాగయి గడ్డ గ్రామానికి చెందిన ధనావత్ బుజ్జి కుమారుడు రంగాతో కలిసి సోమవారం బైక్‌పై పనుల నిమిత్తం పర్వేదుల గ్రామానికి వెళ్తున్నారు. మండలంలోని అంజపపల్లి గ్రామ పరిధిలో ఉన్న గంగ దేవమ్మ గుడి వద్ద ఆకస్మికంగా బైక్ బ్రేక్ వేయడంతో వెనకాల కూర్చున్న ధనావత్ బుజ్జి రోడ్డుపై పడడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భర్త ధనావత్ సైదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోధు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

‘సహకార’ం అవినీతిమయం

- కీతవారిగూడెం సహకార బ్యాంక్‌లో చోరీ కేసులో అనుమానాలెన్నో..
- స్ట్రాంగ్ రూం లాకర్లలో ఉండాల్సిన నోట్ల కట్టలు బీరువాపై..
- పోలీసుల తనిఖీల్లో రూ.11లక్షలు గుర్తింపు
- బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు
- సీఈఓ, క్యాషియర్ పాత్రపై పోలీసుల ఆరా



గరిడేపల్లి మండలం కీతవారిగూడెంలోని రాయినిగూడెం పీఏసీఎస్ భవనం

గరిడేపల్లి : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామ పరిధి రాయినిగూడెం సహకార సంఘం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే బ్యాంక్‌లోకి దుండగులు చొరబడి రూ.8లక్షలు చోరీ చేసిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. కేసు విచారణలో భాగంగా పోలీసులు బ్యాంక్‌లోకి వెళ్లి విచారణ చేపట్టగా స్ట్రాంగ్ రూము లాకర్లలో ఉండాల్సిన రూ.11లక్షలు బీరువాపై కాగితాల మధ్యలో ఉండడం విస్మయపరుస్తోంది. ఇందులో అడుగడుగునా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆ డబ్బు ఎక్కడిది?

చోరీ ఘటనలో బ్యాంక్ అధికారుల పాత్రపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. గత శుక్రవారం వరకు రైతుల నుంచి అప్పుల రూపంలో డబ్బులు వసూలు చేసిన అధికారులు వారి ఖాతాల్లో జమ చేసి సమీప సహకార బ్యాంక్‌లో భద్రపర్చాల్సి ఉంటుంది. అయితే, బ్యాంక్‌కు వరుసగా రెండు రోజుల పాటు సెలవులు ఉండగా అధికారులు డబ్బు భద్రపరచకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు ఒక్క శుక్రవారమే బ్యాంక్ అధికారులు రైతుల నుంచి రూ.19లక్షలు (చోరీకి గురైన రూ.8లక్షలతో కలిపి) వసూలు చేశారా? ఆ డబ్బును అధికారులు ఎదుకు నిర్లక్ష్యంగా బీరువాపై, కౌంటర్లలో ఉంచారనేది అంతుచిక్కని ప్రశ్నలు. అసలు కార్యాలయ సిబ్బంది రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ము ఎంత..? ఈ డబ్బు లెక్కల్లోకి చేరనివా అనే అనుమానాలు లేకపోలేదు. దీనిపై గడిచిన రెండు రోజులుగా పోలీసులు బ్యాంక్ అధికారులను విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత అసలు విషయాలు బయటపడే అవకాశం ఉంది.

బంగారం సురక్షితం

కీతవారిగూడెం గ్రామ పరిధిలోని రాయనిగూడెం పీఏసీఎస్‌లో బంగారం సురక్షితంగానే ఉందని జిల్లా బ్యాంకు మేనేజర్ రవికుమార్ తెలిపారు. బుధవారం పీఏసీఎస్ బ్యాంకులో అప్రైజర్ మదనాచారితో బంగారం నిల్వలను, ఖాతాదారుల వివరాలను తనిఖీ చేశారు. బ్యాంకు పరిధిలో 33 బంగారం లోన్ల ఖాతాలు ఉన్నాయని, ఖాతాదారులు తాకట్టుపెట్టిన గోల్డ్ లోను తీసుకున్న బంగారంలో ఎలాంటి తేడాలు లేవని తెలిపారు. ఆయన వెంట సుపర్‌వైజర్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

గరిడేపల్లి మండలం రాయినిగూడెం పీఏసీఎస్‌లో జరిగిన చోరీపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె చాంద్‌పాష డిమాండ్ చేశారు. పాలక మండలి, ఉద్యోగ సిబ్బందిని తక్షణమే తొలగించాలన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయనిగూడెం పీఏసీఎస్‌లో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. రైతులకు వచ్చే సబ్సిడీ పేరు మీద మందు కట్టల పేరుమీద, వడ్డీ మాఫీ మీద వచ్చిన డబ్బులను కాజేశారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కీత సోమయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, మట్టయ్య, కృష్ణమూర్తి, రాంమ్మూర్తి, నర్సయ్య, శ్రీను, నాగులు మీరా, నాగయ్య, సైదయ్య తదితరులున్నారు.

వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం

- నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

భువనగిరిటౌన్ : బీసీ వర్గాల్లోని కుల, చేతివృత్తి దారులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. పనిముట్లు, ముడి సరుకులు కొనుగోలు చేసుకునేందుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను విడుదల చేసింది. మంగళవారంనుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనుంది.

మార్గదర్శకాలు ఇవీ..

- బీసీ కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు అర్హులు. పనిముట్ల కొనుగోలు, ఆధునీకరణ లేదా ముడిసరుకు
- కొనుగోలుకు మాత్రమే ఆర్థికసాయం అందిస్తారు.
- అభ్యర్థుల వయస్సు జూన్ 2నాటికి 18–55 ఏండ్లు ఉండాలి.
- వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు.
- ఆ కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వృత్తుల అభ్యున్నతికి ఆర్థిక సాయం అందిస్తారు.
- దరఖాస్తు తేదీ నుంచి గత 5 ఏండ్లలో ఏ ప్రభుత్వ శాఖ ద్వారా కూడా లబ్ధిపొందిన వారు. 2017– 18లో రూ. 50 వేల ఆర్థిక సాయం పొందిన వారు అనర్హులు.

ఎంపిక ప్రక్రియ ఇది..

- 20 తేదీ వరకు http://tsobmmrbc.cgg.gov.in వెబ్‌సైట్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి.
- రేషన్‌కార్డు, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోను దరఖాస్తుతో సమర్పించాలి.
- 20 నుంచి జూన్ 26వ తేదీ వరకు మండలస్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తు దారుల వివరాలను పరిశీలిస్తారు.
- జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీకి నివేదిస్తారు.
- ఆ కమిటీ అర్హులను గుర్తించి జాబితాను సిద్ధం. చేసి జూన్ 27వ తేదీలోగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది.
- రూ.లక్ష ఆర్థిక సాయం కోసం ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ఆన్‌లైన్లో ప్రకటిస్తారు.
- ఆ తర్వాత లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాకు నేరుగా రూ.లక్ష ఆర్థికసాయాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుంది.
- ఆర్థికసాయం పొందిన నెలలోగా ఆ నిధులతో పనిముట్లు, ముడిసరుకును లబ్ధిదారులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్‌ను పర్యవేక్షిస్తారు.

చనిపోతూ ముగ్గురికి ప్రాణదానం !

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బ్రెయిన్ డెడ్
- అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చనిపోతూ ముగ్గురికి ప్రాణదానం చేశాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన బెల్లంకొండ నాగేశ్వరరావు (42) స్వగ్రామం నుంచి బైక్‌పై ఇటీవల సూర్యాపేట వైపు వెళ్తుండగా మార్గమధ్యలో దురాజ్‌పల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అయితే, నాగేశ్వరావు బ్రెయిన్‌డెడ్ కావడంతో కోమాలోకి వెళ్లాడు. వైద్యులు బతకడం కష్టమని తేల్చిచెప్పడంతో కుటుంబ సభ్యులు అవయవ దానానికి ఒప్పుకున్నారు. కాగా, చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు బుధవారం మృతిచెందడంతో ముందుగా నిర్ణయించిన ప్రకారం అతడి కిడ్నీలు, గుండె, లివర్‌ను ఆస్పత్రి సిబ్బందికి అందజేయగా ముగ్గురికి అమర్చారు.చనిపోతూ మరో ముగ్గురికి ప్రాణదానం చేయడంతో ఆస్పత్రి యజమాన్యం అభినందించింది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగేశ్వరరావు మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.



నాగేశ్వరరావు (ఫైల్)

పోలీసులకు గోవుల వాహనం అప్పగింత

నకిరేకల్ : అనకాపల్లి నుంచి హైదరాబాద్ పాతబస్తీకి తరలిస్తున్న గోవుల వాహనాన్ని పట్టుకుని నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్ తెలిపారు. అనంతరం గోవులను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని, గోవులను నల్లగొండలోని సమర్థ నారాయణ గోశాలకు తరలించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సూరపల్లి గోపాల్, సిరిశాల నర్సింహ తిరందాస్ ప్రకాశ్, చిట్టిప్రోలు శివలింగం ఉన్నారు.

గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని వ్యక్తి మృతి

కనగల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కనగల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని పొనుగోడు గ్రామానికి చెందిన చాడ లింగయ్య(55) చండూరు పట్టణంలోని బస్టాండ్ ముందు టీస్టాల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే షాపు ముగించుకుని మంగళవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై పొనుగోడుకు బయలుదేరాడు. మార్గమధ్యలో మండల పరిధిలోని కురంపల్లి పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లు వద్ద గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో లింగయ్యకు తీవ్రగాయాలు కావడంతో నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా బుధవారం రాత్రి మృతిచెందాడు. లింగయ్య బీఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పనిచేసాడు. ఆయన మృతికి పలువురు బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు. లింగయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



లింగయ్య(ఫైల్)

నేటి నుంచి మృగశిర కార్తె ప్రారంభం



నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రామగిరి(నల్లగొండ): మృగశిర కార్తె గురువారం నుంచి ప్రారంభం కానుంది. కృతిక, రోహిణి కార్తెల్లో ఎండలకు అల్లాడిపోయిన ప్రజలు మృగశిర కార్తె ప్రవేశంతో కాస్తంతా ఉపశమనం కలుగనుంది. వానాకాలం ఆరంభానికి సూచనగా భావించే ఈ కార్తెలోనే రుతుపవనాలు ప్రవేశిస్తాయి. 15 రోజుల పాటు మృగశిర కార్తె ఉంటుంది. మాంసం ప్రియులు తొలిరోజు చేపలు తినేందుకు ఆసక్తి చూపుతుందటారు.ఈ రోజు చేపలు తింటే వ్యాధులు దూరమవుతాయనేది ప్రజల బలమైన నమ్మకం. ముఖ్యంగా గుండె జబ్బులు, అస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుందని చెబుతుంటారు. అందుకనే నల్లగొండ పట్టణంలో పానగల్లు, ప్రకాశం బజార్, బీటీఎస్, దేవరకొండ రోడ్డులోని చేపల మార్కెట్లు చేపలు ప్రజలతో రద్దీగా దర్శనమిచ్చాయి.



కొనుగోలు చేసిన చేపను చూపుతున్న వృద్ధుడు





భారీ చేపలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న యువకుడు, పానగల్ రోడ్డులో చేపల విక్రయం

డంపింగ్‌యార్డులో మంటలు



డంపింగ్‌యార్డులో ఎగిసిపడుతున్న మంటలు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని శేషమ్మగూడెం సమీపంలోని డంపింగ్ యార్డులో మంగళవారం రాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. పొగతో మొదలై మంటలు చెలరేగడంతో మున్సిపల్ కమిషనర్ కె.వీ.రమణాచారి అధికారులతో మాట్లాడి రెండు ఫైరింజన్లు తెప్పించారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు ఫైరింజన్ల ద్వారా మంటలు చల్లార్చి అదుపులోకి తెచ్చారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీఈలు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉదయం 7గంటల వరకు అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. వేసవి కావడంతో డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పు అంటుకుందా లేక ఎవరైనా సిగరెట్లు తాగి వేయడం వలన మంటలు అంటుకున్నాయా అనే కోణంలో మున్సిపల్ అధికారులు ఆరా తీస్తున్నారు.

తప్పిన భారీ ఆస్తి నష్టం

మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు అదుపులోకి రాకపోతే మున్సిపల్ ఆస్తులతో పాటు దానికి సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్తులకు సైతం భారీగా నష్టం జరిగి ఉండేది. మంటలు చెలరేగడాన్ని వెంటనే సకాలంలో గుర్తించిన మున్సిపల్ సిబ్బంది వెంటనే కమిషనర్ రమణాచారి దృష్టికి తీసుకుపోయారు. దాంతో ఫైర్ అధికారులతో మాట్లాడి ఫైరింజనును త్వరగా డంపింగ్ యార్డుకు చేరుకునేలా చేశారు. అప్పటికే డంపింగ్ యార్డులో చెత్తనంతా మంటలు అంటుకొని పొగ కమ్ముకుంది. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పడంతో భారీ ఆస్తినష్టం తప్పింది.

వివాహం కావడం లేదని..

- పురుగుల మందు తాగిన యువకుడు మృతి

హుజూర్‌నగర్: వివాహం కావడం లేదని జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకూరు మండలం చెన్నారిగూడేనికి చెందిన బండి సుధాకర్ (33) హుజూర్ నగర్‌లోని ఒక గదిలో అద్దెకు ఉంటూ స్థానిక తెలంగాణ ఆస్పత్రిలోని మెడికల్ షాప్‌లో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అయితే అతని తమ్ముడికి వివాహం అయినా కూడా తనకు వివాహం కావడం లేదని జీవితంపై విరక్తి చెందాడు. గత నెల 31న తన గదిలోనే పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంటనే వారు వచ్చి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేటు హాస్పటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. సుధాకర్ తమ్ముడు బండి వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి

అడ్డగూడూరు : తాటిచెట్టు పైనుంచి కిందపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈఘటన అడ్డగూడూరు మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పులిపలుపుల యాదగిరి (53) రోజూ మాదిరిగా కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తాటివనాల్లో వెతకగా యాదగిరి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



ఘటనాస్థలంలో యాదగిరి మృతదేహం

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి లారీ దగ్ధం

మునుగోడు: షార్ట్ సర్క్యూట్‌తో పత్తి లారీ దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం మునుగోడులో చోటుచేసుకుంది. బాధిత వ్యాపారి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం చొల్లేడు గ్రామానికి చెందిన పత్తి వ్యాపారి శేఖర్ రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని లారీలో వరంగల్‌కు తరలిస్తున్నాడు. మార్గమధ్యలో మునుగోడు గ్రామ శివారులోని కార్మిక నగర్ వద్ద విద్యుత్ వైర్లు ఆనుకొని మంటలు లేచి పత్తికి నిప్పు అంటుకున్నాయి. దీంతో అందులో ఉన్న దాదాపు 15 క్వింటాళ్ల పత్తి పూర్తిగా దగ్ధమైయింది. అంతే కాకుండా లారీ సగానికి పైగా దగ్ధమైయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



దగ్ధమైన పత్తి లారీ

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఎగిరి ఎదురుగా వచ్చే రెండు లారీలను ఢీకొట్టిన వైనం
- అక్కడికక్కడే ఇద్దరు, చికిత్స పొందుతూ మరొకరు మృతి..ఇంకొకరికి గాయాలు
- చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో దుర్ఘటన



ధ్వంసమైన కారు, ఇరుక్కుపోయిన మృతదేహాలు

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారు జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న స్కోడా కారు చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారు అండర్ పాస్ సమీపంలోని మసీదు వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.ఆపై పైకి ఎగిరి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న రెండు లారీలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరికి సైతం తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాలను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి, గాయపడిన వారిని కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. గాయపడిన మరొకరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, మృతుల, క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కట్టంగూర్ : అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కట్టంగూర్ గ్రామ పంచాయతీ పరిధి మీర సాహెబ్‌గూడెంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పర్నె నర్సిరెడ్డి(48) తనకున్న 5 ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, వరిపంట సాగు చేశాడు. పంట దిగుబడి రాకపోవటంతో అప్పులు పాలయ్యాడు. అప్పులు పెరగటంతో మనస్తాపం చెంది మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. గమించిన కుటుంబ సభ్యులు అతడిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. సుమారు రూ.10 లక్షలు అప్పు అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య పరమేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ రాజు తెలిపారు.



నర్సిరెడ్డి (ఫైల్)

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్..

సంస్థాన్ నారాయణపురం: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంస్థాన్‌నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడెంలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్రి సత్తయ్య–శోభల కుటుంబం హైదారాబాద్‌లోని ఎల్‌బీ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. సత్తయ్య వ్యాపారం చేస్తుండగా, ఆయన కుమారుడు మహేష్(27) సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. మహేష్‌కు 5నెలల క్రితం మసీద్‌గూడెం గ్రామానికి చెందిన ఆఖిలతో వివాహం జరిగింది. కాగా, మహేష్ సోమవారం హైదారాబాద్ నుంచి తన స్వగ్రామామైన మల్లారెడ్డిగూడేనికి వెళ్తున్నాని కుంటుంబ సభ్యులుకు చెప్పి గ్రామానికి చేరుకున్నాడు. ఇంట్లోకి వెళ్లి గేట్‌కు బయట నుంచి తాళం వేసుకున్నాడు. దాంతో గేటుకు తాళం ఉండటంతో గ్రామస్తులు ఎవరూ గమనించలేదు. ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. కుంటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్పందించడం లేదు. మృతుడి తల్లి శోభ ఇంటిని అద్దెకు ఇవ్వాడానికి వచ్చి చూడగా, కుమారుడు విగత జీవిగా పడి ఉన్నాడు. దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల క్రితం మృతిచెందినట్లుగా అనుమానిస్తున్నారు. బెట్టింగ్‌లు ఆడటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనట్లు తెలిసింది. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుంటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మహేష్(ఫైల్)

పురుగుల మందు తాగి..

పాలకవీడు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పాలకవీడు మండలంలోని యల్లాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాలగాని సైదులు(40) విద్యుత్‌శాఖలో ఆర్టిజన్‌గా విధులు నిర్వహించడంతో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల సైదులు అత్త మృతిచెందడంతో రైతుబీమా డబ్బులు, ఇల్లు అమ్మకం విషయంలో వివాదం నెలకొంది. దీంతో మనస్తాపం చెందిన సైదులు మంగళవారం రాత్రి యల్లాపురం గ్రామానికి చేరుకుని తన వ్యవసాయ భూమిలో మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. ఉదయాన్నే అటుగా వెళ్లిన రైతులు గమనించడంతో అప్పటికే మృతిచెందాడు. వారిచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు.



ఘటనాస్థలంలో వెంకటేశ్వర్లు మృతదేహం